

మానకొండూర్ : సన్మానం పొందిన సర్పంచులతో మాజీ పార్లమెంట్ సభ్యుడు వినోద్‌కుమార్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీఆర్

# అడ్డదారిన కాంగ్రెస్ అధికారం

## కరీంనగర్ మాజీ ఎంపీ వినోద్‌కుమార్

మానకొండూర్, జనవరి 31: కాంగ్రెస్ పార్టీ మోసపూరిత వాగ్దానాలు, ఆచరణకు సాధ్యం కానీ హామీలను ఇచ్చి అడ్డదారిలో అధికారంలోకి వచ్చిందని కరీంనగర్ మాజీ ఎంపీ వినోద్‌కుమార్ విమర్శించారు. ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తేనే వారికి అధికారంలో ఉండే నైతిక హక్కు ఉంటుందని స్పష్టం చేశారు. మానకొండూర్ మీనాక్షి కన్వెన్షన్ హాల్‌లో బీఆర్‌ఎస్ మండల శాఖ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన సర్పంచుల ఆత్మీయ వీడ్కోలు సన్మాన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావుతో కలిసి సర్పంచులకు శాలువా కప్పి, జ్ఞాపికలను అందచేసి సన్మానించారు. అనంతరం వినోద్‌కుమార్ మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన కేసీఆర్ సర్కారు పాలనలో గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాయని గుర్తుచేశారు. 2014లో రాష్ట్రం ఏర్పాటైందని, కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యారని, 2014 నుంచి 2023 వరకు ఒక లక్షా 60 వేల ఉద్యోగాలను కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిందని గుర్తు చేశారు. ఏయే శాఖల్లో ఎన్నెన్ని ఉద్యోగాలు భర్తీ చేశామో..? వివరంగా వెల్లడించామని, ఇది అందరికీ తెలుసునన్నారు. కానీ, అప్పుడు పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న రేవంత్ రెడ్డి బీఆర్‌ఎస్ ప్రభుత్వోద్యోగాలు ఇవ్వలేదని అబద్ధాలను ప్రచారం చేసి, నిజాన్ని నమ్మకుండా చేసి యువత జీవితాలతో ఆడుకున్నారని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం లక్షా 60 వేల ఉద్యోగాలు ఇచ్చింది నిజమా.. కాదా ? రేవంత్‌రెడ్డి చెప్పాలని డిమాండ్ చేశారు. వారందరికీ జనవరిలో వేతనాలు ఇచ్చింది నిజమా కాదా..? చెప్పాలన్నారు. రేవంత్‌రెడ్డికి దమ్ము, ధైర్యం ఉంటే డిసెంబర్ 2024లోగా భర్తీ చేస్తామని చెప్పిన రెండు లక్షల ఉద్యోగాలు ఎప్పుడు భర్తీ చేస్తాడో.. పత్రికా ముఖంగా చెప్పాలని డిమాండ్ చేశారు. ఫిబ్రవరి నెల చివరి వరకు ఏ శాఖలో..? ఎన్ని ఉద్యోగాలు భర్తీ చేస్తాడో ప్రకటించి నోటిఫికేషన్ విడుదల చేస్తే యువత పోటీపరీక్షలకు సిద్ధమై ఉద్యోగాలు సాధిస్తారని ఆకాంక్షించారు. బీఆర్‌ఎస్ సర్కారు గతంలో 7వేల స్టాఫ్‌నర్స్ పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చి పరీక్ష నిర్వహించిందని, కానీ, ఎన్నికల కోడ్ కారణంగా ఫలితాలు, ఉద్యోగాల భర్తీ నిలిచి పోయిందన్నారు. వారికి ఇప్పుడు రేవంత్‌రెడ్డి వారికి ఉద్యోగనియామక పత్రాలు అందించి కాంగ్రెస్ ప్రభుత్వమే కొలువులు ఇచ్చినట్లు గొప్పలు చెప్పుకుంటున్నారని దుయ్యబట్టారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, జడ్పీటీసీ తాళ్లపెల్లి శేఖర్‌గౌడ్, తెలంగాణ జాగృతి జిల్లా కన్వీనర్ గట్టెపల్లి దీపక్‌కుమార్, బీఆర్‌ఎస్వీ నియోజకవర్గ కన్వీనర్ గుర్రం కిరణ్‌గౌడ్, నాయకులు ఎరుకల శ్రీనివాస్‌గౌడ్, శాతరాజు యాదగిరి, పడాల సతీశ్‌గౌడ్, దండబోయిన శేఖర్, రామగిరి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ బంగారి స్వామి, వైద్యులు

## నేటి నుంచి కరీంనగర్‌లో రాష్ట్ర స్థాయి

# ఆర్థోపెడిక్ వైద్యుల సదస్సు

విద్యానగర్, జనవరి 31: తెలంగాణ రాష్ట్ర ఆర్థోపెడిక్ వైద్యుల 9వ రాష్ట్ర సదస్సును మొట్ట మొదటిసారిగా కరీంనగర్‌లో నిర్వహిస్తున్నట్లు కోసా (కరీంనగర్ ఆర్థోపెడిక్ సర్జన్స్ అసోసియేషన్) అధ్యక్షుడు, ప్రొఫెసర్ బంగారి స్వామి తెలిపారు. జిల్లాకేంద్రంలోని రెనీ హస్పిటల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గురువారం నుంచి నాలుగురోజులపాటు వీ కన్వెన్షన్‌లో సదస్సు నిర్వహిస్తున్నామని, సుమారు వెయ్యి మంది వైద్యులు పాల్గొంటారని, దేశ విదేశాల నుంచి సీనియర్ వైద్యులు కూడా హాజరవుతారని చెప్పారు. సదస్సులో ఆర్థోపెడిక్ వైద్య విధానంలో ఆధునిక పద్ధతుల ఆవిష్కరణలు, నూతన వైద్య విధానాలను వివరిస్తారని, ప్రతిమ, చల్మెడ, రెనీ హాస్పిటళ్లలో రోబోటిక్ లైవ్ సర్జరీలు ఉంటాయని చెప్పారు. ఈ సదస్సు ఆర్థోపెడిక్ విద్యార్థులు, వైద్యులకు ఎంతో ఉపయోగపడుతుందని సూచించారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ చైర్మన్ ప్రొఫెసర్ మోతీలాల్, కో చైర్మన్ డాక్టర్ నర్సింహులు, కో ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ వంశీధర్‌రెడ్డి, కోశాధికారి డాక్టర్ వేముల చంద్రశేఖర్, సైంటిఫిక్ కమిటీ చైర్మన్ డాక్టర్ వెంకట్‌రెడ్డి, సీనియర్ వైద్యులు వీ రాంరెడ్డి, చిట్ల వంశీ, రాము, అభిలాశ్, కీర్తన, తదితరులు పాల్గొన్నారు.

# విదేశాల్లో కొలువులకు 2న ఇంటర్వ్యూలు



కరీంనగర్ కమాన్‌చౌరస్తా, జనవరి 31: విదేశాల్లో ఉద్యోగాల కల్పనకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అభ్యర్థులకు ఈ నెల 2న ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు కరీంనగర్ ఉపాధి కల్పనాధికారి కే దేవేందర్ రావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ ఓవర్సీస్ మ్యానఖపవర్ కం. లి.(టామ్కామ్) శుక్రవారం కరీంనగర్ బస్టాండ్ ఎదుట ఉన్న నెహ్రూ యువ కేంద్రంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నదని చెప్పారు. ఇజ్రాయిల్‌లో నిర్మాణ కార్మికులు, షట్టరింగ్, కార్పెంటర్లు, సిరామిక్ టైలింగ్, ప్లాస్టరింగ్, ఐరన్ బెండింగ్ పనులు చేసేందుకు డిమాండ్ ఉన్నదన్నారు. అభ్యర్థులకు పదో తరగతి ఉత్తీర్ణులై, మూడేళ్ల అనుభవంతో 21 నుంచి 45 ఏళ్ల మధ్య వయసు ఉండాలని, ఎంపికైన వారికి నెలకు ₹1.20 లక్షల నుంచి ₹1.30 లక్షల వరకు వేతనం ఉంటుందని చెప్పారు. మిగతా వివరాలకు 99854 83931లో సంప్రదించాలని సూచించారు.

## వేతన జీవులకు

# ఊరట కలిగేనా..?

### ఆదాయ పన్ను పరిమితి పెంపుపై మోడీ సర్కారు నిర్లక్ష్యం



- వేతనాలు పెరిగినా లిమిట్ పెంచక వేతన జీవుల ఇబ్బందులు
- ఉమ్మడి జిల్లా నుంచి ఏటా ₹450 కోట్ల ట్యాక్స్ చెల్లింపులు
- సగటున ప్రతి ప్రభుత్వోద్యోగి 1.50 లక్షలు..
- ఏండ్లుగా పన్ను పరిమితి పెంచాలనే డిమాండ్లు
- నేటి కేంద్ర మధ్యంతర బడ్జెట్‌పై ఆశలు
- ఈ సారైనా కరుణ చూపిస్తారా? లేదా అన్న చర్చ





**ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఇన్‌కం టాక్స్ లిమిట్‌ను ₹5 లక్షలకు పెంచాలని డిమాండ్ చేసిన బీజేపీ, అధికార పగ్గాలు చేపట్టగానే ఆ విషయాన్ని మరిచిపోయింది. పెరిగిన వేతనాలకు అనుగుణంగా ఆదాయ పన్ను పరిమితిని పెంచడంపై వివక్ష చూపుతున్నది. ఫలితంగా వేతన జీవులకు పదేళ్లుగా ఎదురుచూపులే మిగులుతున్నాయి. నేడు మధ్యంతర బడ్జెట్‌ను ప్రవేశపెడుతుండగా.. మళ్లీ ఆశలు చిగురించాయి. ఎన్నికలు వస్తున్న నేపథ్యంలో ఈ సారైనా కేంద్రం కరుణ చూపుతుందా..? ఆదాయ పన్ను పరిమితిని పెంచుతుందా..? లేదా అన్న ఉత్కంఠ వేతన జీవుల్లో కనిపిస్తున్నది.**

కరీంనగర్, జనవరి 31 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : న్యాయబద్ధంగా ఉద్యోగులకు వేతన ఒప్పందాల ద్వారా సాలరీలను కొంత మేరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెంచుతూ వస్తున్నాయి. ఆ మేరకు ఖర్చులు కూడా పెరుగుతున్నాయి. అయితే పెరుగుతున్న వేతనాలకు అనుగుణంగా ఆదాయ పన్ను పరిమితి మాత్రం పెరుగడం లేదు. దీంతో పెంచిన వేతనాలను తిరిగి కేంద్రం పన్ను రూపేణా మింగేస్తున్నదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిజానికి ఆదాయ పరిమితిని ₹2.50 లక్షల నుంచి ₹5 లక్షలకు పెంచి తీరాలని గత యూపీఏ ప్రభుత్వాన్ని ఆనాటి బీజేపీ నాయకులు పార్లమెంట్‌లో డిమాండ్ చేశారు. ఆ పార్టీ నేత అరుణ్ జైట్లీ ఈ విషయంపై యూపీఏ ప్రభుత్వాన్ని నిలదీశారు కూడ. అయితే ఎన్డీఏ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ మాటను నాయకులు పట్టించుకోలేదు. పదేళ్లుగా దేశాన్ని పాలిస్తున్న మోడీ ప్రభుత్వం.. వేతన జీవులపై ఏమాత్రం కనికరం చూపడం లేదు. పన్ను పరిమితి పెంచే విషయంలో వివక్ష చూపుతూనే వస్తున్నది. పదేళ్ల కాలంలో కొత్తగా ఒక స్లాబ్‌ను తీసుకొచ్చిందే తప్ప.. పరిమితి మాత్రం పెంచ లేదు. యూపీఏ ప్రభుత్వ హయాంలో ఉన్న పాత స్లాబ్‌ను అమలు చేస్తూనే.. కొత్త స్లాబ్‌ను కలిపి రెండు రకాల స్లాబ్‌లను ప్రస్తుతం కేంద్రం అమలు చేస్తున్నది. అంతే తప్ప ఆదాయ పన్ను, స్టాండర్డ్ డిడక్షన్, అలాగే పొదుపు మినహాయింపు పరిమితులు మాత్రం పెంచడం లేదు.

### స్లాబులు ఇలా..

యూపీఏ ప్రభుత్వ హయాంలో ఉన్న స్లాబ్ ప్రకారం చూస్తే.. ₹2.50 లక్షల నుంచి ₹5 లక్షల వరకు 5శాతం, ₹5 లక్షల నుంచి ₹10 లక్షల వరకు 20శాతం, ₹10 లక్షలకుపైగా ఆదాయముంటే 30 శాతం టాక్సు చెల్లించాలి. అలాగే బీజేపీ ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన స్లాబ్ ప్రకారం చూస్తే.. ₹2.50 లక్షల నుంచి ₹5 లక్షల వరకు 5 శాతం, ₹5లక్షల నుంచి ₹7.5 లక్షల వరకు 10శాతం, ₹7.5లక్షల నుంచి ₹10 లక్షల వరకు 15 శాతం, ₹15లక్షల నుంచి ₹12.50 లక్షల వరకు 20శాతం, ₹15 లక్షలకు పైబడి ఆదాయముంటే 30శాతం టాక్సు చెల్లించాలనే స్లాబ్‌ను అమలు చేస్తున్నది. అయితే బీజేపీ అమల్లోకి తెచ్చిన రెండో స్లాబ్‌ను మెజార్టీ వేతన ఉద్యోగులు పక్కన పెట్టారు. ఈ స్లాబ్‌ను ఎంచుకుంటే.. పొదుపు పరిమితి అంటే ₹1. 50లక్షలు మినహాయింపులు వర్తించవు. గృహరుణాలపై ఇంట్రెస్టు మినహాయింపులు వర్తించవు. అందుకే ఉద్యోగులంతా మొదటి స్లాబ్‌నే ఆధారంగా చేసుకొని పన్ను చెల్లిస్తున్నారు.

### ఈ సారైనా ఉరట లభించేనా..?

ఈ స్లాబ్‌లను మార్చాలని, ముఖ్యంగా ఆదాయ పన్ను పరిమితిని ₹2.50 నుంచి 5 లక్షలకు పెంచాలని మోడీ ప్రభుత్వం అధికార పగ్గాలు చేపట్టిన నాటి నుంచి వేతన జీవులు కోరుతున్నారు. అలాగే ప్రస్తుతమున్న పొదుపు పరిధి ₹1.50 లక్షల నుంచి ₹3 లక్షలకు పెంచాలని చాలా ఏండ్లుగా కేంద్రానికి విజ్ఞప్తి చేస్తున్నారు. బ్యాంకు ఇంట్రెస్టు మినహాయింపును ₹2 లక్షలనుంచి ₹3 లక్షల వరకు పెంచాలని కూడా డిమాండ్ చేస్తున్నారు. అయినా మోడీ ప్రభుత్వం మాత్రం వీటిని ఏమాత్రం లెక్క చేయడం లేదు. ప్రతి బడ్జెట్ సమయంలో కేంద్రం ఏమైనా కరుణిస్తుందా..? అని ఎదిరి చూడడం, తీరా కేంద్రం ఎటువంటి నిర్ణయాలు తీసుకోకపోవడంతో నిరాశకు లోనవుతున్నారు. ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికలు సమీపించిన నేపథ్యంలో వస్తున్న మధ్యంతర బడ్జెట్‌పై మళ్లీ ఆశలు పెరుగుతున్నాయి. ఈ సారైనా కేంద్రం కరుణ చూపుతుందా..? లేక గతంలో మాదిరిగానే దాటవేస్తుందా..? అన్న దానిపై జోరుగా చర్చ జరుగుతున్నది.

### టాక్సు రూపేణా ఏటా ₹450 కోట్లకుపైగా..

ఉద్యోగ, ఉపాధ్యాయ, ఎలక్ట్రిసిటీ వంటి విభాగాలే కాదు, అన్ని విభాగాల్లో పనిచేసే ఉద్యోగుల సంఖ్య ఉమ్మడి జిల్లాలో 30వేల పైచిలుకు ఉన్నది. ప్రతి ఉద్యోగి ఆదాయ పన్ను పరిధిలోకి వచ్చారు.వీరితో పాటు పెన్షనర్లు 25 నుంచి 30వేల మంది ఉన్నారు. ఒక్కో ఉద్యోగి సుమారు ₹60 వేల నుంచి ₹4లక్షల వరకు ట్యాక్సులు కడుతున్నారు. ఉద్యోగుల గణాంకాల ప్రకారం చూస్తే.. సగటున ₹1.50 లక్షల వరకు పన్ను చెల్లింపులు జరుగుతున్నాయి. ఆ లెక్కన చూస్తే.. ఏటా ఉమ్మడి జిల్లా ఉద్యోగులు ₹450కోట్ల వరకు ఆదాయ పన్నును కేంద్రానికి చెల్లిస్తున్నారు. ఇది చాలదన్నట్లుగా ట్యాక్సు కటింగ్‌పై మళ్లీ 4 శాతం సర్‌చార్జీని విధించి కేంద్రం వసూలు చేస్తున్నది. ఇది కూడా అదనపు భారంగా ఉంటున్నది. కొంత మంది పెన్షనర్లు కూడా పన్ను కోవలోకి వస్తున్నారు. వీరు ఆదాయపన్ను నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరుతున్నారు. ఈ పరిస్థితుల్లో నేటి కేంద్ర బడ్జెట్‌పై ఆశలు పెట్టుకున్నారు. ఈ సారైనా ఆదాయపన్ను పరిమితి పెంచాలని డిమాం డ్ చేస్తున్నారు. ఎన్నికల నేపథ్యంలో కేంద్రం ఏమైనా నిర్ణయం తీసుకుంటుందా..? లేదా? అన్నది నేడు తేలనుండగా, ఉత్కంఠతతో ఎదురుచూస్తున్నారు.

# పత్తి కొనుగోళ్లకు సీసీఐ బ్రేక్

- నేటినుంచి 4 వరకు నిలుపుదల
- మిల్లుల్లో నిల్వ చేసే స్థలం లేదని సాకు
- ఆకస్మిక నిర్ణయంపై పత్తి రైతుల్లో అనుమానాలు
- జిన్నింగ్ మిల్లులను పరిశీలించిన డీడీఎం పద్మావతి
- ఐదు నుంచి కొనుగోళ్లు ఉంటాయంటున్న మార్కెటింగ్ అధికారులు
- ఇప్పటి వరకు 2,24,965 క్వింటాళ్ల పత్తి కొనుగోళ్లు
- జమ్మికుంటలో అత్యధికం

**పత్తి కొనుగోళ్లకు తాత్కాలిక బ్రేక్ పడింది. జిన్నింగ్ మిల్లుల్లో నిల్వ చేసేందుకు స్థలం లేదనే సాకుతో సీసీఐ ఆకస్మిక నిర్ణయం తీసుకున్నది. గురువారం నుంచి ఫిబ్రవరి 4 దాకా కొనుగోళ్లు నిలిపివేస్తున్నట్లు ప్రకటించడం, మార్కెటింగ్ అధికారులకు సమాచారం ఇవ్వడంపై రైతుల్లో అనేక అనుమానాలను లేవనెత్తింది. ఈ క్రమంలో డీడీఎం పద్మావతి బుధవారం జిల్లాలోని పలు జిన్నింగ్ మిల్లులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, విషయాన్ని కలెక్టర్ పమేలా సత్పతి దృష్టికి కూడా తీసుకెళ్లారు. అయితే కొనుగోళ్ల నుంచి తప్పించుకునేందుకే సీసీఐ అధికారులు ఈ ప్రయత్నాలు చేస్తున్నారని రైతులు ఆరోపిస్తుండగా, మరోవైపు ఈనెల 5వ తేదీ నుంచి కొనుగోళ్లు జరుగుతాయని అధికారులు భరోసా ఇస్తున్నారు.**

కరీంనగర్, జనవరి 31 (నమస్తే తెలంగాణ) : అక్టోబర్ ఒకటి నుంచి కరీంనగర్ జిల్లాలో పత్తి కొనుగోళ్లు చేస్తున్నారు. కొనుగోళ్ల కోసం కరీంనగర్ మార్కెట్ యార్డ్ పరిధిలో 3, జమ్మికుంట మార్కెట్ యార్డ్ పరిధిలో 7, చొప్పదండి మార్కెట్ యార్డ్ పరిధిలో 1, గోపాల్‌రావుపేట యార్డ్ పరిధిలో మరొకటి చొప్పున జిల్లాలో మొత్తం 12 మిల్లులను నోటిఫై చేశారు. సీసీఐ, ప్రైవేట్ వ్యాపారుల ద్వారా ఇప్పటి వరకు 2,24,965 క్వింటాళ్ల పత్తిని కొన్నారు. ఇంకా ఫిబ్రవరి నెలాఖరు వరకు పత్తి దిగుబడులు వచ్చే అవకాశం ఉన్నది. కానీ, సీసీఐ అధికారులు మాత్రం నోటిఫైడ్ మిల్లుల్లో రా పత్తి నిల్వ చేసుకునేందుకు స్థలం లేదని, ఉన్న పత్తిని బేల్లు కట్టే దాకా కొనుగోళ్లను తాత్కాలికంగా నిలిపి వేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో సీసీఐ అధికారుల తీరుపై రైతులు మండిపడుతున్నారు. కొనుగోళ్లను ప్రైవేట్ వ్యాపారులకు అప్పగించే ప్రయత్నంలోనే సీసీఐ తప్పుకుంటున్నదని ఆరోపిస్తున్నారు. పొడువు రకం గింజ పత్తి క్వింటాలుకు ₹7,020, మధ్య రకం గింజ పత్తి క్వింటాలుకు ₹6,620గా కనీస మద్దతు ధర కేంద్రం నిర్ణయించిందని, సీసీఐ నిబంధనలతో ఈ మద్దతు ధర ఏ రైతు పండించిన పత్తికి రావడం లేదని వాపోయారు. సీసీఐ రంగంలో ఉంటేనే ప్రైవేట్ వ్యాపారులు కనీస ధర చెల్లించైనా పత్తి కొనుగోలు చేస్తారని, లేకుంటే సిండికేట్‌గా ఏర్పడి అడ్డగోలుగా తగ్గించి కొంటారని ఆందోళన చెందుతున్నారు. జమ్మికుంట లాంటి ప్రాంతంలో ఇప్పటి వరకు సీసీఐ కంటే ప్రైవేట్ వ్యాపారులే ఎక్కువ పత్తిని కొనుగోలు చేశారని, అది సీసీఐ ఉండడంతోనే చెప్పారు. ఇప్పుడు చేతులెత్తేస్తే పండించిన పత్తిని తెగనమ్ముకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. జిన్నింగ్ మిల్లులో నిల్వ చేసుకునే స్థలం లేదనేది సాకేనని, తిరిగి తెరుస్తుందన్న నమ్మకం లేదని స్పష్టం చేస్తున్నారు. ప్రస్తుతం అన్ని జిన్నింగ్ మిల్లుల్లో కలిపి రోజుకు 10 నుంచి 12 వేల క్వింటాళ్ల పత్తి మాత్రమే మార్కెటింగ్ అవుతున్నదని, ఈ మాత్రం పత్తిని నిల్వ చేసే సామర్థ్యం మిల్లులకు లేదని చెప్పడం సరికాదంటున్నారు. అంతే కాకుండా బేల్లు ఇవ్వడంలో కూడా జిన్నింగ్ మిల్లులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపిస్తున్నారు. ఈ కారణంగా చివరి దశలో మిల్లుల్లో స్థలం లేకుండా పోయిందని, ఇది అధికారులకు కనిపించడం లేదా అని ప్రశ్నిస్తున్నారు. పత్తి దిగుబడులు వచ్చే వరకు కొనుగోళ్లు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

### పత్తి కొనుగోళ్లు ఇలా..

| మార్కెట్ యార్డు | ప్రైవేట్‌గా కొన్నది (క్వింటాళ్లు) | సీసీఐ కొన్నది (క్వింటాళ్లు) |
|---|---|---|
| కరీంనగర్ | 1,423 | 58,987 |
| జమ్మికుంట | 69,207 | 57,458 |
| చొప్పదండి | 349 | 17,285 |
| గోపాల్‌రావుపేట | – | 20,256 |

### మిల్లుల్లో తనిఖీలు

జిన్నింగ్ మిల్లుల్లో స్థలభావం కారణంగా పత్తి కొనుగోళ్లను తాత్కాలికంగా నిలిపి వేస్తామని సీసీఐ అధికారులు చెప్పగానే, వాస్తవ పరిస్థితులు అంచనా వేసేందుకు కరీంనగర్ డీడీఎం పద్మావతి బుధవారం పలు మిల్లులను తనిఖీ చేశారు. కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ పరిధిలోని ఎలబోతారం శక్తి మురుగన్ జిన్నింగ్ మిల్లుతోపాటు చొప్పదండి మార్కెట్ పరిధిలోని రుక్మాపూర్ శివ శివాణి మిల్లులో ఆమె తనిఖీ చేశారు. శక్తి మురుగన్ జిన్నింగ్ మిల్లులో కొంత స్థలం ఉందని, శివ శివాణి మిల్లు మాత్రం పూర్తిగా నిండి పోయిందని ఆమె గుర్తించారు. అయితే ఇప్పటి వరకు ఉన్న పత్తిని వెంట వెంటనే బేల్లు కట్టి సీసీఐకి ఇచ్చినట్లయితే కొత్తగా వచ్చే రా పత్తిని నిల్వ చేసుకునేందుకు అవకాశం ఉంటుందని ఆమె మిల్లర్లకు సూచించారు. ఈ దిశగా చర్యలు తీసుకుంటున్నామని కూడా ఆమె వెల్లడించారు. కాగా ఈ పరిస్థితిని కలెక్టర్ పమేలా సత్పతి దృష్టికి కూడా మార్కెటింగ్ అధికారులు తీసుకెళ్లారు.



చొప్పదండి మండలం రుక్మాపూర్‌లోని శివ శివాణి జిన్నింగ్ మిల్లులో పరిశీలిస్తున్న డీడీఎం పద్మావతి

### 5 నుంచి మళ్లీ కొనుగోళ్లు

సీసీఐ పత్తి కొనుగోళ్లను తాత్కాలికంగానే నిలిపి వేస్తున్నది. రైతులు ఆందోళన అవసరం లేదు. ఇప్పటికే కరీంనగర్ జిల్లాలో 2.24 లక్షల క్వింటాళ్లకుపైగా పత్తిని కొనుగోలు చేశాం. ఇంకా ఎంత వచ్చినా కొనేందుకు సీసీఐ అధికారులు సిద్ధంగా ఉన్నారు. మిల్లుల్లో స్థల భావం కారణంగానే గురువారం నుంచి ఫిబ్రవరి నాలుగో తేదీ వరకు కొనుగోళ్లు తాత్కాలికంగా నిలిపి వేస్తున్నారు. తిరిగి ఐదో తేదీ నుంచి కొనుగోళ్లు చేయించే బాధ్యత మాది. రైతులు భరోసాగా ఉండాలి. సీసీఐ కేంద్రాలకు మంచి నాణ్యమైన పత్తిని తీసుకెళ్లాలి. అలాంటప్పుడే ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధర వస్తుంది.

**- పద్మావతి, డీడీఎం కరీంనగర్**



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్

## 5న కరీంనగర్ అసెంబ్లీ

# కార్యకర్తల సమావేశం

- ముఖ్య అతిథిగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు రాక
- ఎమ్మెల్యే గంగుల కమలాకర్
- క్యాంపు కార్యాలయంలో సన్నాహక సమావేశం

కార్పొరేషన్, జనవరి 31: ప్రతి కార్యకర్త నుంచి రాష్ట్రస్థాయి నాయకుల దాకా ప్రజాప్రతినిధుల మధ్య అనుబంధాన్ని పెంచడం, పార్టీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ నెల 5న కరీంనగర్ నియోజకవర్గ కార్యకర్తల సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే గంగుల కమలాకర్ తెలిపారు. కరీంనగర్‌లోని కొండ సత్యలక్ష్మి గార్డెన్‌లో నిర్వహించే ఈ సమావేశానికి మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ముఖ్య అతిథిగా హాజరవుతున్నారని చెప్పారు. ఈ మేరకు బుధవారం క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ ముఖ్య నాయకులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మేయర్ సునీల్ రావు, బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరి శంకర్, ఎంపీపీ తిప్పర్తి లక్ష్మయ్య, కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రుద్రరాజు, నాయకులు పొన్నం అనిల్ కుమార్ గౌడ్, జమీలుద్దీన్, కాసరపు శ్రీనివాస్ గౌడ్, పిట్టల రవీందర్, పిల్లి మహేశ్, సుంకిశాల సంపత్ రావు, జువ్వాడి రాజేశ్వర్ రావు ఉన్నారు.

## నేటి నుంచి ఇంటర్

# ప్రాక్టికల్ పరీక్షలు

కమాన్‌చౌరస్తా, జనవరి 31: రాష్ట్రంలోని ఇంటర్ సెకండియర్ విద్యార్థులకు గురువారం నుంచి ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభమవుతున్నాయి. ఈ మేరకు కరీంనగర్ జిల్లాలో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి జగన్మోహన్ రెడ్డి పేర్కొన్నారు. ఈ నెల 1న ప్రారంభమయ్యే పరీక్షలు 15న ముగుస్తాయని, మొత్తంగా మూడు విడతల్లో నిర్వహిస్తామన్నారు. ఇందులో మొదటి విడత ఈ నెల 1 నుంచి 5వ తేదీ దాకా, రెండో విడత 6 నుంచి 10వ తేదీ దాకా, మూడో విడత ఫిబ్రవరి11 నుంచి 15వ తేదీ వరకు ఉంటాయన్నారు. ఇందు కోసం జిల్లాలో 58 రెగ్యులర్ కేంద్రాలు, ఒకేషనల్ విభాగంలో 16 కేంద్రాలు మొత్తం 74 ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ క్రమంలో బోటనీలో 2,264 మంది, జువాలజీలో 2,263 మంది, ఫిజిక్స్‌లో 11,289 మంది, కెమిస్ట్రీలో 11,288 మంది మొత్తం 27,104 మంది విద్యార్థులు ప్రాక్టికల్ పరీక్షలకు హాజరవుతున్నారని వివరించారు.

# ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ బడులు

- కేసీఆర్ సర్కారు పాలనలోనే అభివృద్ధి
- ‘మన ఊరు- మనబడి’తో మౌలిక వసతులు
- జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్



సారంగాపూర్‌లోని ఉన్నత పాఠశాలలో పలు అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత

సారంగాపూర్, జనవరి 31: ‘తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటుకు దీటుగా తీర్చాదిద్దారని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ స్పష్టం చేశారు. మన ఊరు–మనబడి, మన ఊరు–మనబస్తీ ద్వారా విరివిగా నిధులు మంజూరు చేసి మౌలిక వసతులు కల్పించారని గుర్తు చేశారు. బుధవారం సారంగాపూర్ అర్పల్లిలో వేంకటేశ్వరస్వామి ఆలయ సమీపంలో ₹9లక్షలతో నిర్మించనున్న కల్యాణ మండపానికి భూమి పూజ చేశారు. సారంగాపూర్ ప్రైమరీ, ఉన్నత పాఠశాలల్లో పూర్తి చేసిన అభివృద్ధి పనులను జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంతతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయాచోట్ల ఎమ్మెల్యే మాట్లాడారు. కరోనా కారణంగా ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా గత కేసీఆర్ సర్కారు పల్లెల అభివృద్ధికి విరివిగా నిధులు వెచ్చించిందన్నారు. సర్పంచ్‌లు గ్రామాల ప్రగతిలో ముఖ్య భూమిక పోషించారని అభినందించారు. సారంగాపూర్ దివంగత సర్పంచ్ కొండ్ర మల్లారెడ్డితో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. తనకు 15, 16 ఏండ్ల వయస్సు ఉన్నప్పటి నుంచి ఆయన తెలుసని, చుట్టుపక్కల 30, 40 గ్రామాలకు సుపరిచితులని చెప్పారు. కాంగ్రెస్ నుంచి గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా పనిచేశారని, మండలాభివృద్ధికి ఎంతగానో కృషి చేసి సారంగాపూర్ మల్లారెడ్డిగా పేరు తెచ్చుకున్నారని గుర్తు చేశారు. ప్రస్తుత సర్పంచ్ గుర్రాల రాజేందర్‌రెడ్డి చిన్న గ్రామమైన అభివృద్ధిలో ముందు వరసలో నిలిపారని ప్రశంసించారు. మాజీ ఎంపీ, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సహకారంతో మండలాన్ని అభివృద్ధి చేశానని చెప్పారు. జడ్పీ చైర్‌పర్సన్ వసంత మాట్లాడుతూ, ఈ రోజు మన ఊరు–మన బడిలో భాగంగా ₹50 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రారంభించడం సంతోషంగా ఉన్నదన్నారు. కేసీఆర్ పాలనలోనే పాఠశాల విద్యారంగం అభివృద్ధి చెందిందన్నారు. కాగా, ఎమ్మెల్యే, జడ్పీ చైర్‌పర్సన్‌ను, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమాల్లో జడ్పీటీసీ మేడిపెల్లి మనోహర్ రెడ్డి, వైస్ ఎంపీపీ సొల్లు సురేందర్, సర్పంచ్ కొండ శ్రీలత పాల్గొన్నారు.